సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



క్రీడలతో స్నేహభావం

కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో శనివారం కోలిండియా స్థాయి అథ్లెటిక్స్ మీట్ ప్రారంభమైంది. 8లో



నువ్వా.. నేనా ?!

జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 21°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం నుంచే ఎండ వేడి మొదలై పగటి పూట తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన పూజలు చేశారు. తెల్లవారుజామునే గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశాక స్వామివారిని మేళ తాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

బంగారు గాజులు బహూకరణ



బంగారు గాజులను ఆలయ అధికారులకు అందజేస్తున్న భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం రామాలయానికి హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌కు చెందిన భక్తులు డి.మహీందర్‌రెడ్డి – మంజుల దంపతులు సుమారు రూ.3.70 లక్షల విలువైన నాలుగు బంగారు గాజులను శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా వారు గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను దాత కుటుంబానికి అందజేశారు.

క్రీడల్లో రాణించాలి



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

కొత్తగూడెంటౌన్: క్రీడా పోటీల్లో రాణించాలని జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి పి.పరంధామరెడ్డి సూచించారు. కొత్తగూడెం త్రీఇంక్లైన్‌లోని తెలంగాణ క్రీడా మైదానంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు పట్టుదలతో సాధన చేసి జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించాలని చెప్పారు. పోటీల్లో 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా, విజేతలకు టీపీసీసీ సభ్యుడు, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నాగ సీతారాములు, తూము చౌదరి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు పెద్దన్నబాబు, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు యుగేందర్‌రెడ్డి, కాశీహుస్సేన్, పి. నిహారిక, ఐ. ఆది నారాయణ, ఆంగోతి మోతి, బోడ శారద, వెంకటప్రసాద్, బి.తరుణ్, టీ.మానస, మోతిలాల్, రవి, రజిని, రాకేష్, మానస పాల్గొన్నారు.

విజయవాడ ప్యాసింజర్ రైలు ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ వరకు నడిచే ప్యాసింజర్ రైలు శనివారం నుంచి ప్రారంభమైంది. కాజీపేట–విజయవాడ రైలు మార్గంలో మూడో లైన్ పనులు జరుగుతున్న కారణంగా ఈ రైలును కొన్ని రోజులపాటు రద్దు చేశారు. రైల్వే అధికారులు తిరిగి ప్రారంభించడంతో భద్రాలచం రోడ్డు నుంచి విజయవాడ వరకు వివిధ అవసరాల నిమిత్తం, దైవ దర్శనానికి వెళ్లే భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బెల్గావి రైలును కూడా ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఒక విజయం.. ఎందరికో స్ఫూర్తి

మహిళల అండర్–19 వరల్డ్ కప్‌లో రాణించిన త్రిష

- కూతురు లక్ష్యసాధనకు అండగా నిలిచిన తండ్రి
- వారిని ఆదర్శంగా తీసుకుని చిన్నారులకు క్రీడల్లో తర్ఫీదు
- సందడిగా మారిన భద్రాచలం జూనియర్ కళాశాల మైదానం



భద్రాచలంలో చిన్నారిని మైదానానికి తీసుకొచ్చిన తండ్రి



సండే స్పెషల్

భద్రాచలం: ఒక్క విజయం.. ఏళ్ల శ్రమను చెరిపేసింది. ఎంతో మంది చిన్నారులు, తల్లిదండ్రుల్లో స్ఫూర్తి రగిలించింది. దేశంలో తెలంగాణ ఖ్యాతిని మరోసారి చాటిచెప్పింది. అదే మహిళల అండర్–19 క్రికెట్ వరల్డ్ కప్‌లో భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష సాధించిన విజయం. ఆ విజయం వెనుక ఉన్న ఆమె తండ్రికి అందరూ జేజేలు పలికారు. ఇప్పుడా ఆ తండ్రీ కూతుళ్లను ఆదర్శంగా తీసుకుని పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రీడా శిక్షణ ఇప్పిస్తున్నారు. గతంలో భద్రాచలం డివిజన్‌కు చెందిన సాధనపల్లి ఆనంద్ ఎవరెస్టు శిఖరం అధిరోహించిన సమయంలోనూ పలువురు స్ఫూర్తి పొంది రాక్ క్లైంబింగ్‌లో సాధన చేశారు.

తండ్రి ఆశయం..కూతురు విజయం

భద్రాచలానికి చెందిన గొంగడి రామిరెడ్డి స్వతహాగా హాకీ క్రీడాకారుడు. 20 ఏళ్ల క్రితమే భద్రాచలంలో జిమ్ నిర్వహించాడు. కుటుంబ, ఆర్థిక ఇబ్బందులతో తాను సాధించలేకపోయిన కలను తన కూతురు ద్వారా సాధించాలని నిశ్చయించుకున్నాడు. మూడేళ్ల వయసులోనే కూతురు త్రిషతో క్రికెట్ బ్యాట్ పట్టించాడు. తానే కోచ్‌గా మారి సాధన చేయించాడు. సొంత ఖర్చులతో శాశ్వత సిమెంట్ నెట్ పిచ్ ఏర్పాటు చేయించి క్రికెట్‌లో ఓనమాలు దిద్దాడు. భారత జట్టులో స్థానం సాధించాలంటే ఇంకా సాధన అవసరమని భావించి, భద్రాచలంలో ఉన్నదంతా అమ్ముకుని హైదరాబాద్ బాట పట్టాడు. ఆ తండ్రీకూతుళ్లకు తల్లి మాధవి అడుగడుగునా వెన్నుదన్నుగా నిలిచింది. తల్లిదండ్రుల తోడ్పాటుతో త్రిష అహర్నిశలు సాధన చేసి, అండర్–16, అండర్–19 జట్లలో రాణించింది. రెండుసార్లు అండర్–19 మహిళల ప్రపంచ క్రికెట్ కప్‌ను సాధించటంలో కీలక పాత్ర పోషించింది. కీలకమైన మ్యాచ్‌లలో రాణించటంతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌ను సైతం అందుకుంది. ఇలా ప్రతి వేదికపై తన విజయం వెనుక ఉన్న తన తండ్రి త్యాగం, బాధ్యతలను గుర్తు చేసుకుంది.



భద్రాచలంలో సాధన సమయంలో త్రిషతో తండ్రి రామిరెడ్డి (ఫైల్)

స్ఫూర్తిదాయకంగా నిలిచి..

అశేష ప్రతిభ చాటిన త్రిష పలువురికి మార్గదర్శకంగా నిలిచింది. తల్లిదండ్రుల ఆలోచనా దృక్పథంలో మార్పు తెచ్చింది. ఫలితంగా పిల్లలు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు చేయూతనిస్తున్నారు. భద్రాచలంలో ఆమె బ్యాట్ పట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఇప్పుడు ప్రాక్టీస్ సందడి నెలకొంది. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, క్రికెట్, టెన్నిస్, కరాటే సాధన చేసేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో, సెలవు దినాల్లో తల్లిదండ్రులే తోడుగా వచ్చి సాధనకు ప్రోత్సహిస్తున్నారు. మూడు, నాలుగేళ్ల చిన్నారులతో కూడా తల్లిదండ్రులు సాధన చేయిస్తున్నారు.



క్రికెట్‌లో నెట్ ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు

బాలికల సంఖ్య పెరిగింది



అండర్–19 ప్రపంచ కప్‌లో త్రిష చూపిన ప్రతిభ తర్వాత క్రికెట్ కోచింగ్‌కు బాలికల రాక పెరిగింది. గతంలో బాలబాలికలు ఉన్నప్పటికీ ఇప్పుడు బాలికలను తల్లిదండ్రులు ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నారు. ఇటువంటి వాతావరణం అభినందనీయం. అన్ని క్రీడల్లోనూ బాలికలు పాల్గొనే శాతం పెరిగింది.

– కుప్పాల తేజ, క్రికెట్ అకాడమీ కోచ్

ఫాదర్ ఆఫ్ త్రిషనే ఆదర్శంగా..



భద్రాచలానికి చెందిన గొంగడి రామిరెడ్డి తన కూతురిని అంతర్జాతీయ క్రీడాకారిణిగా తీర్చిదిద్దిన తీరు అద్భుతం. ఆ తండ్రీకూతుళ్లను ఆదర్శంగా తీసుకుని నా కుమార్తెకు చిన్న వయసులోనే కోచింగ్ ఇప్పిస్తున్నాను. నా కూతురు క్రీడల్లో రాణించేలా తోడ్పాటునందిస్తా.

– చల్లకోటి సాయిబాబు, క్రీడాకారిణి తండ్రి

త్రిష అక్క స్ఫూర్తితో..



భద్రాచలానికి చెందిన త్రిష అక్క సాధించిన విజయాలను, ఆమె కష్టపడిన తీరు మా అమ్మానాన్నలు చెబుతున్నారు. అక్క ఇచ్చిన స్ఫూర్తితో క్రికెట్‌లో కోచింగ్ తీసుకుంటున్నాను. దీనికి మా తల్లిదండ్రులు అందిస్తున్న సహకారం మరువలేనిది.

– యశస్వి, క్రీడాకారిణి

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: ప్రతీ కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్'ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమంగా ఇసుక, గంజాయి రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్లను గుర్తించాలని, గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. అన్ని ఠాణాల పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీలు రెహమాన్, సతీష్ కుమార్, చంద్రభాను, మల్లయ్య స్వామి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

పాల్వంచరూరల్: సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి, 6,7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సమన్వయ అధికారి అనిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 కేంద్రాల్లో 5,130 మంది పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

శ్రీవారికి అభిషేకం

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. గర్భగుడిలో మూలవిరాట్‌తోపాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి పంచామృతంతో అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మ వార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించగా, భక్తుల సమక్షాన పల్లకీ సేవ చేశారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఎన్నికల అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ నెల 27న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పీఓ, ఏపీఓలకు శనివారం కలెక్టరేట్‌లో రెండో విడత శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు ముందురోజే చేరుకుని ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులు, ఎలక్షన్ సామగ్రిని పరిశీలించుకోవాలని అన్నారు. 26న ఉదయం కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సామగ్రి అందజేస్తామని అన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్లు ధారా ప్రసాద్, రంగాప్రసాద్, జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనీ పూసపాటి సాయికృష్ణ, కిరణ్‌కుమార్, అశోక్, నవీన్ పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో ఇబ్బందులు రావొద్దు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మార్చి రెండో తేదీ నుంచి ప్రారంభమయ్యే రంజాన్ మాసంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసంలో చేయాల్సిన ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని మసీదుల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రార్థనా సమయాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో ఎండ ప్రభావం వల్ల ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యశాఖాధికారులను ఆదేశించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లాలోని మసీదులు, మతపెద్దల వివరాలను అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు, డీపీఓ చంద్రమౌళి, డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలకు పాదయాత్ర



కాలినడకన ద్వారకా తిరుమలకు బయల్దేరిన సాయిబాబా భక్తులు

అశ్వారావుపేటరూరల్: ద్వారకా తిరుమల క్షేత్రానికి అశ్వారావుపేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా భక్తులు శనివారం పాదయాత్రగా బయల్దేరారు. స్థానిక బాబా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం 30 మంది భక్తులు సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం సమీపంలో ఉన్న ద్వారకా తిరుమల ఆలయానికి కాలినడకన తరలివెళ్లారు. కాగా, స్వామి వారి ఆలయానికి సాయిబాబా భక్తులు పాదయాత్రగా వెళ్లడం ఇది ఎనిమిదోసారి అని సాయిసేవా సమితి బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు హరి, టి.అప్పారావు, కర్నాటి శ్రీను, స్వప్న, రమాదేవి పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి చర్యలు

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



విద్యార్థినుల ప్రతిభా పాటవాలను పరీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్

మణుగూరు రూరల్ : గిరిజన విద్యార్థుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అధికారులకు సూచించారు. మణుగూరు గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రూ.1.80 కోట్లతో చేపడుతున్న 12 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం జీపీఎస్ పాఠశాలను సందర్శించారు. ఉద్దీపకం వర్క్ బుక్స్ పాఠ్యాంశాలను విద్యార్థులు చదువుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆ తర్వాత మణుగూరులోని అంబేద్కర్ సెంటర్ ప్రాంతంలో ఐటీడీఏ హౌసింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పోలీస్ కౌన్సెలింగ్ హాస్ నిర్మాణ పనులను పరిశీలించారు. నెల రోజుల్లోగా పనులు పూర్తిచే యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ చంద్రశేఖర్, డీఈ మధుకర్, ఏఈలు ప్రసాద్, యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రతిభా పరీక్ష

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 55 ఆశ్రమ పాఠశాలలు, 12 గిరిజన గురుకులాల నుంచి 335 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని వెల్లడించారు. భద్రాచలం, అంకంపాలెం, ఖమ్మం ఏజీహెచ్‌ఎస్‌లతో పాటు పాల్వంచ, బుజ్జిగూడెం ఏహెచ్‌ఎస్‌ల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆరు సబ్జెక్టుల్లో 25 చొప్పున 150 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఓఎంఆర్ షీట్ ద్వారా పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరీక్షలో టాపర్లకు నగదు పురస్కారం అందజేస్తామని, పదో తరగతి తర్వాత సైతం వారు మెరుగైన కాలేజీలు ఎంచుకునేలా అండగా నిలిచి స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తామని పీఓ తెలిపారు.

కొందరికే భరోసా..!

- గందరగోళంగా పెట్టుబడిసాయం అందజేత
- మూడెకరాలున్న రైతులకూ జమకాని నగదు
- రైతు భరోసాపై స్పష్టతనివ్వని వ్యవసాయాధికారులు



యాసంగి వరినాట్లు వేస్తున్న కూలీలు

బూర్గంపాడు: రైతు భరోసా గందరగోళంగా మారింది. మూడెకరాల లోపు సాగు భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాల్లో జమచేశామని ప్రభుత్వం చెబుతుండగా.. తమకు రైతు భరోసా అందలేదని మూడెకరాల లోపు భూమి ఉన్న పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఎకరంలోపు ఉన్నవారికీ అందలేదని పలువురు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులను అడిగితే జమవుతుందని దాటవేస్తున్నారే తప్ప స్పష్టత ఇవ్వడంలేదు.

కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు

రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగు పెట్టుబడుల కోసం జనవరి 26 నుంచి రైతు భరోసా నగదు జమ ప్రారంభించింది. గతంలో ఎకరాకు రూ. 5 వేలు ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం రూ. 6 వేలకు పెంచింది. ఈ ఏడాది వానాకాలం పంటలకు పెట్టుబడి సాయం అందలేదు. యాసంగి పంటల సాగుకు రైతు భరోసా అందిస్తోంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా తొలుత మండలానికో గ్రామంలో పూర్తిస్థాయిలో పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమచేసింది. ఆ తర్వాత మిగతా గ్రామాల్లో విడతల వారీగా ఎకరంలోపు రైతులకు, అనంతరం రెండెకరాలు, ఆ తర్వాత మూడు ఎకరాల్లోపు రైతులకు రైతు భరోసా జమ చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది. కానీ ఎకరం, రెండెకరాలు, మూడు ఎకరాల సాగు భూములు ఉన్న కొందరు రైతులకు ఇప్పటివరకు రైతు భరోసా అందలేదు. నగదు సాయం అందనివారు బ్యాంకులు చుట్టూ, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వెనుకాముందో అందరికీ వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెప్పుకొస్తున్నారుకానీ స్పష్టమైన సమాధానం చెప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు జమైంది..కానిది మండల వ్యవసాయశాఖ అధికారులు రైతులకు వివరించారు. ఆన్‌లైన్‌లో సెర్చ్ ఆప్షన్‌లో చెక్ చేసి నగదు ట్రెజరీలో ఉందా, సెండ్ టు బ్యాంకు చూపిస్తుందా? బ్యాంకు ఖాతా తప్పుగా ఉందా? అని స్పష్టంగా చెప్పారు. తప్పు, ఒప్పులుంటే సరిచేసి రైతుబంధు అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం రైతు భరోసా జమకాని రైతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం సెర్చ్ ఆప్షన్ తొలగించినట్లు తెలుస్తోంది.

93,670 మంది రైతులకు జమ..

ఇప్పటివరకు జిల్లాలో 93,670 మంది రైతులకు రూ.100.29 కోట్ల రైతు భరోసా వారి ఖాతాల్లో జమైంది. వీరందరూ మూడు ఎకరాలలోపు సాగు భూమి ఉన్న రైతులే. వీరుకాక మూడు ఎకరాలలోపు సాగు భూమి ఉన్న మరో 20 వేల మందికి రైతుభరోసా అందలేదని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. కాగా, జమైన వివరాలు తెలుసుకునేందుకు వ్యవసాయ అధికారులకు సెర్చ్ ఆప్షన్ ఇవ్వాలని, రైతు భరోసా స్టేటస్‌ను తెలుసుకునే వెసులుబాటు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

అందరికీ అందుతుంది



సాగు భూములన్నింటికీ రైతు భరోసా అందుతుంది. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు 96వేల మంది రైతుల ఖాతాల్లో నగదు జమైంది. అందనివారు బ్యాంకు ఖాతాలను సరిచూసుకోవాలి.

–బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

80 సెంట్ల భూమి ఉన్నా రాలె..



నాకు 80 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. అయినా రైతు భరోసా అందలేదు. బ్యాంకుల దగ్గరకు వెళితే నగదు జమకాలేదన్నారు. వ్యవసాయ అధికారులను అడిగితే జమవుతాయని చెబుతున్నారు. ఏమీ అర్థం కావట్లే.

–జంగిలి వెంకన్న, రైతు, గొమ్మూరు

భరోసా అందించాలి



గత ప్రభత్వం లాగా పంటలు సాగు చేస్తున్న రైతులందరికీ రైతు భరోసా అందించాలి. వ్యవసాయశాఖ అధికారులకు రైతు భరోసా చెల్లింపులకు సంబంధించిన సెర్చ్ ఆప్షన్ ఇవ్వాలి.

–గోపిరెడ్డి రమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు

క్లుప్తంగా

భద్రాచలంలో కలాం స్ఫూర్తి యాత్ర



సాంకేతికతపై వివరిస్తున్న బృందం సభ్యులు

భద్రాచలంటౌన్: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తి యాత్ర శనివారం భద్రాచలం చేరుకుంది. ఈ సందర్భంగా ఫ్లోబస్సు వ్యవస్థాపకుడు మధువిలాస్‌బాబు మాట్లాడారు. తెలంగాణవ్యాప్తంగా విద్యార్థులకు అత్యాధునిక సాంకేతికతపై అవగాహన కల్పించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా పట్టణంలోని యూఆర్‌జేసీ గురుకుల కళాశాలలో విద్యార్థులకు ఎల్‌ఓటీ, ఏఐ, త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్స్, ఏఆర్ అండ్ వీఆర్, మెషిన్ లెర్నింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అజయ్‌రెడ్డి, దిలీప్‌కుమార్, సాయి సుబ్రహ్మణ్యం, రోహిత్ జలగం, అర్చన నాగపురి, పైలట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

మణుగూరురూరల్: అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సంక్షేమం, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. పార్టీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మణుగూరు మండలం చిక్కుడుగుంటలో అమరవీరుల స్మారక సంస్మరణ పైలాన్‌ను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐ ఎల్లవేళలా పేదల పక్షాన నిలుస్తుందని, సమస్యల పరిష్కారం, హక్కుల కోసం పోరాడుతుందని తెలిపారు. ఈ క్రమంలో అమరులైన నేతల పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని ప్రతీ కార్యకర్త పార్టీ బలోపేతానికి పాటుపడుతూనే ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా మాట్లాడగా నాయకులు రావుల మురళి, డి.సుధాకర్, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, దుర్గ్యాల సుధాకర్, సాయిబాబా, ముక్కు నర్సారెడ్డి, పత్తిపాటి నాగేశ్వరరావు, సర్వర్, ఎస్.కుటుంబరావు, జి.మనోహరాచారి, పద్మనాభరాజు, కె.రామారావు, సత్యం, భిక్షం, వెంకటేశ్వర్లు, ఎడారి రమేశ్, బాడిశ సతీశ్, లక్ష్మయ్య, నిర్మల, సుజాత, రమేశ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాల సాధనకు కృషి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీడీ మణెమ్మ

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ సూచించారు. భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో శనివారం పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యా యులకు ఇచ్చిన శిక్షణలో ఆమె మాట్లాడారు. గత విద్యాసంవత్సరం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో 91 శాతం మంది ఎస్సెస్సీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఈ ఏడాది వంద శాతం నమోదయ్యేలా కృషి చేయాలని తెలిపారు. ఐటీడీఏ పీఓ రాహుల్ రూపొందించిన ప్రణాళికను పాటించడంతో పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అలాగే, వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తే జిల్లా రాష్ట్రంలో ముందు నిలుస్తుందని డీడీ తెలిపా రు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరూనాయక్, ఏటీడీఓ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నువ్వా.. నేనా?!

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల పోటాపోటీ ప్రచారం

- తాము గెలిస్తేనే సమస్యల పరిష్కారమని భరోసా
- ఉమ్మడి జిల్లాలో 6,111 మంది ఓటర్లు, 47 పోలింగ్ కేంద్రాలు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం – నల్లగొండ – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం హోరెత్తుతోంది. ఈనెల 27న జరగనున్న పోలింగ్‌కు 25వ తేదీతో ప్రచారం ముగియనుండగా అభ్యర్థులు ఓట్ల సాధనకు పోటాపోటీగా ప్రచారంలో మునిగారు. ఓ వైపు అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూనే.. మరోవైపు ప్రత్యర్థి బలహీనతల ఆధారంగా ముందుకు సాగుతున్నారు. తమను గెలిపిస్తేనే ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయని హామీలు గుప్పిస్తున్నారు. అభ్యర్థులకు తోడు ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు, కుల సంఘాల నాయకులు కూడా దూసుకెళ్తుండడం విశేషం. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 6,111 మంది ఓటర్లకు గాను 47 పోలింగ్ కేంద్రాలను గుర్తించిన అధికారులు ఇతర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

బరిలో 19మంది..

ఈ స్థానానికి 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా, పలు ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో అలుగుబెల్లి నర్సిరెడ్డి రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలిచారు. రెండో స్థానంలో నాడు పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి పూల రవీందర్ నిలిచారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన ఉపాధ్యాయ సంఘాలతోపాటు రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల మద్దతుతో వారు పోటీ పడుతున్నారు.

సై అంటే సై..

మునుపెన్నడూ లేని విధంగా టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నిక ఇటు ఉపాధ్యాయ సంఘాలు, అటు రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ కలిగిస్తోంది. మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని అలుగుబెల్లి నర్సిరెడ్డి, తమను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పులి సరోత్తమ్‌రెడ్డి, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, పూల రవీందర్, ఎస్. సుందర్‌రాజ్‌యాదవ్ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.

ఆ ఘనతలు మావే..



పింగిలి శ్రీపాల్‌రెడ్డి

పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఉపాధ్యాయినులకు ఐదు అదనపు సెలవులు, అప్రెంటిస్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు, 13 రోజుల సమ్మె కాలానికి వేతనం మంజూరు ఘనత తమకే దక్కుతుందని ప్రచారాస్త్రంగా చేసుకున్నారు. సర్వీస్ రూల్స్ సాధన, ఉపాధ్యాయులకు ఉన్నతస్థాయి పదోన్నతులు, సీపీఎస్ విధానం రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సాధనకు పోరాడుతానని చెబుతున్నారు.

పార్టీ బలం.. ఉపాధ్యాయ సంఘాల మద్దతు



పులి సరోత్తమ్‌రెడ్డి

బీజేపీ, ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో పులి సరోత్తమ్‌రెడ్డి పోటీలో నిలిచారు. ఆయన ప్రచార బాధ్యతలను బీజేపీ భుజానికెత్తుకోగా మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. 317 జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా కృషి చేయడంతో ఇతర సమస్యలు పరిష్కరిస్తానని చెబుతున్న సరోత్తమ్‌రెడ్డి తనను గెలిపించాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించా..



పూల రవీందర్

బహుజన ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో పూల రవీందర్ పోటీలో ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కులను కాపాడడానికే పోటీ చేస్తున్నట్లు చెబుతున్న ఆయన ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం పోరాడానని వివరిస్తున్నారు. తనను గెలిపిస్తే సర్వీస్ రూల్స్ సాధన, మెరుగైన పీఆర్‌సీ, కేజీబీవీ, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పాటుపడతానని చెబుతున్నారు.

మరోసారి గెలిపిస్తే..



అలుగుబెల్లి నర్సిరెడ్డి

యూటీఎఫ్ అభ్యర్థిగా వివిధ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో బరిలో నిలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డి ఇన్నాళ్లు ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలపై పోరాడినందున మరోమారు తాను గెలుస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మొదటి పీఆర్‌సీ సమయాన ఇందిరా పార్కు వద్ద నిరాహార దీక్ష, మెరుగైన ఫిట్‌మెంట్ సాధన, కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులకు వేసవి సెలవులు, 12 నెలల వేతనం వచ్చేలా కృషి చేస్తానని ప్రచారంలో చెబుతున్నారు. ప్రసూతి సెలవు సాధనలో తనపాత్ర ఉందని వివరిస్తున్నారు.

టీజేఏసీ అభ్యర్థిగా పోటీలో నిలిచి..



గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

57సంఘాల మద్దతుతో టీజేఏసీ అభ్యర్థిగా తాను బరిలో ఉన్నట్లు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తాను 10,479 భాషా పండిట్ పోస్టులను అప్‌గ్రేడ్ చేయించానని, టెట్ నిబంధనతో సంబంధం లేకుండా సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇప్పించానని, మహిళా ఉపాధ్యాయినులకు చైల్డ్ కేర్ లీవ్, కేజీబీవీల్లో సమస్యల పరిష్కారానికి పాటుపడ్డానని, తనను గెలిపిస్తే అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులకు పోరాడుతానని హామీ ఇస్తున్నారు.

ప్రశ్నించే గొంతుకనై.. సాధిస్తా



సుందర్‌రాజ్‌యాదవ్

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎస్.సుందర్‌రాజ్‌యాదవ్ ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులతోపాటు ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. 317 జీఓపై సమీక్ష, సీపీఎస్ విధానం రద్దు, మెరుగైన పీఆర్‌సీ సాధన, ఉపాధ్యాయులందరికీ 010 పద్దు ద్వారా వేతనాల సాధనకు పోరాడుతానని చెబుతున్న ఆయన పెండింగ్ డీఏల విడుదలకూ కృషి చేస్తానని వివరిస్తున్నారు.

WANTED TEACHERS
for the Following Positions
1st to 5th Class : Telugu-1, Hindi-1, English-1
6th to 9th Class : Telugu - 1,
Qualification : Degree and above
Gender : Male/Female
Salary : 15k to 20k
Note : Preferable for Experienced Teachers, also provide Vehicle Facility
ABHINAV HIGH SCHOOL
Pumping Well Road, KHAMMAM.
Cell : 7569845563, 9849068579

దెబ్బతీసిన అకాల వర్షం

పంటలు ఆగమాగం



టేకులపల్లి: మద్దిరాలతండాలో పంటను పరిశీలిస్తున్న ఏఓ అన్నపూర్ణ

టేకులపల్లి/జూలూరుపాడు/పాల్వంచరూరల్: టేకులపల్లి, జూలూరుపాడు, పాల్వంచ మండలాల్లో శనివారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. టేకులపల్లి ఏఓ ఎస్.అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఏఈఓ శ్రావణి మండలంలోని మద్దిరాలతండా, కుంటల్ల, బద్దుతండాల్లో పంటలను పరిశీలించారు. నష్టపోయిన మొక్కజొన్న రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని మాస్‌లైన్ మండల నాయకుడు జర్పుల సుందర్ డిమాండ్ చేశారు. కాగా, అకాల వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. కోయగూడెం నుంచి మద్రాస్‌తండా మార్గంలో చెట్లు విరిగి రోడ్డుపై పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. జూలూరుపాడు మండలంలోని కల్లాల్లోని వర్షానికి మిర్చి రాశులు తడిసిపోకుండా పట్టాలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. పలు గ్రామాల్లో మిర్చిని రాశులు పాక్షికంగా తడిసిపోయాయి. శుక్రవారం కొన్ని గ్రామాలకే పరిమితమైన అకాల వర్షం శనివారం గుండెపుడి, మాచినేనిపేట, మాచినేనిపేటతండా, కరివారిగూడెం, కొమ్ముగూడెం, లైన్‌తండా, చింతలతండా, గురువాగుతండా, కాకర్ల, జూలూరుపాడు, అనంతారం, సాయిరాంతండాల్లో కురిసింది. పాల్వంచ మండలంలోని చంద్రాలగూడెం, రేగులగూడెం, ఉల్వనూరు, రెడ్డిగూడెం, పాండురంగాపురం గ్రామాల పరిధిలో ఆరబోసిన మిర్చి తడిసిపోయింది. మొక్కజొన్న పంట దెబ్బతిన్నది.

హోటల్ తొలగించాలని ఘర్షణ



తీవ్ర గాయాలపాలైన బోడ సురేశ్

టేకులపల్లి: హోటల్ తొలగించాలనే అంశంపై ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శనివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని వారాంతపు సంతకు సమీపంలో రోడ్డు పక్కన కొద్ది నెలలుగా మొఘల్ బిర్యానీ హోటల్ కొనసాగుతోంది. నెల రోజుల కిందటే పాఠశాల యాజమాన్యం ఈ హోటల్‌ని వేరేచోటకు మార్చాలని నిర్వాహకులకు సూచించింది. వారి అభ్యర్థన మేరకు నిర్వాహకులు కూడా వేరే చోటుకు భవనం మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. శనివారం పాఠశాల కరస్పాండెంట్ బంధువు, బోడబజార్‌కు చెందిన బోడ సురేశ్.. మరి కొందరితో కలిసి హోటల్‌కు వెళ్లి తక్షణమే ఖాళీ చేయాలని నిర్వాహకులతో వాగ్వాదానికి దిగి దుర్భాషలాడాడు. టేబుళ్లు, కుర్చీలను కింద పడేశాడు. దీంతో నిర్వాహకులు భవనం యజమానికి సమాచారం ఇవ్వడంతో భూక్య సురేశ్‌తో పాటు మరికొందరు హోటల్‌కి వచ్చి బోడ సురేశ్‌ను ప్రశ్నించారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం, ఘర్షణ మొదలైంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. బోడ సురేశ్ తలకు గాయం కావడంతో సులానగర్ పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్‌ఐ సురేశ్‌ను వివరణ కోసం ప్రయత్నించగా స్పందించలేదు.

నా భర్తను వేధిస్తున్నారు..



భర్త షంషేర్‌తో కలిసి మాట్లాడుతున్న రషీదా

చండ్రుగొండ: గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయమై ప్రశ్నించినందుకు అధికార పార్టీ నాయకులు తన భర్త షంషేర్‌ను వేధిస్తున్నారని అతడి భార్య ఎస్కే రషీదా ఆవేదన వ్యక్తం చేసింది. తిప్పనపల్లి గ్రామంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దత్తత తీసుకుని అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. గ్రామానికి చెందిన షంషేర్ సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాల్లో నాణ్యత విషయమై ప్రశ్నించినందుకు అధికార పార్టీ నాయకులు అక్రమ కేసులు పెట్టి పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని రషీదా ఆరోపించింది. తమకు న్యాయం అందించాలని ఆమె ఉన్నతాధికారులను కోరుతోంది.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది..



ఆర్చరీలో తలపడుతున్న క్రీడాకారులు

సింగరేణి(కొత్తగూడెం): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు పేర్కొన్నారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో కోలిండియా స్థాయి అథ్లెటిక్స్ (మహిళలు, పురుషులు) మీట్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఒలింపిక్ పతాకాన్ని ఆవిష్కరించి, జ్యోతిని వెలిగించి, బెలూన్లు ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్తగూడెం ఏరియాలో ఈసారి వేడుకలు నిర్వహించడం సంతోషకరమని, క్రీడల్లో రాణించి ఆయా కంపెనీలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి దోహదపడతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే ఇండియా పరిధిలోని 9 బొగ్గు సంస్థల జట్లలో సుమారు 284 మంది (107 మహిళలు, 177 పురుషులు) పాల్గొంటున్నారని వెల్లడించారు.

విజేతలు వీరే..

ఆర్చరీలో మొదటి బహుమతి ఎస్.అఖిల్ (సింగరేణి) సాధించాడు. 100 మీటర్ల మహిళల పరుగు పందెంలో మూడో బహుమతి ఈ.సుష్మ, (సింగరేణి), పురుషుల పరుగుపందెంలో రెండో బహుమతి: ఎస్.క్రాంతికిరణ్ (సింగరేణి), డిస్కస్‌త్రో మహిళ విభాగంలో మొదటి బహుమతి మాన్విత (సింగరేణి), మహిళల ట్రిపుల్ జంప్‌లో రెండో బహుమతి ఈ.సుష్మారాణి (సింగరేణి), పురుషుల సైక్లింగ్‌లో మొదటి బహుమతి వి.తిరుపతిరెడ్డి (సింగరేణి), పురుషుల 400 మీటర్ల పరుగు పందెంలో మూడో బహుమతి కందుల సురేశ్ (సింగరేణి), 500 మీటర్ల పరుగుపందెంలో రెండో బహుమతి పి.అవినాష్(సింగరేణి), 100 మీటర్ల హార్డిల్స్ (మహిళలు)లో రెండో బహుమతి ఎం.విజయశాంతి (సింగరేణి) సాధించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

దమ్మపేట/సత్తుపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దమ్మపేట మండలంలోని గండుగులపల్లి గ్రామంలో బుధవారం రాత్రి రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో జగ్గారం గ్రామానికి చెందిన మడివి నాగేంద్రబాబు, వగ్గేల లక్ష్మణ్, సత్తుపల్లి మండలం చిన్నపాకలగూడెంనకు చెందిన కేతేపల్లి జానకీరాం (32)కు తీవ్ర గాయాలు కాగా, మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించిన విషయం పాఠకులకు విదితమే. కాగా, కేతేపల్లి జానకీరాం తలకు తీవ్ర గాయం కావడంతో, ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. జానకీరాం మరణ వార్తతో చిన్నపాకలగూడెం గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

సిగరెట్ కాటన్ల చోరీ నిందితుల అరెస్ట్

పాల్వంచ: ఐటీసీ డీలర్ స్టాక్ పాయింట్ నుంచి సిగరెట్ కాటన్లను చోరీ చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ సతీశ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంరోడ్‌లో ఐటీసీ డీలర్ డీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ స్టాక్ పాయింట్‌లో ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు షట్టర్లు పగులగొట్టి రూ.26 లక్షల విలువ చేసే 24 సిగరెట్ కాటన్లను చోరీ చేశారు. 4వ తేదీ ఉదయం గుర్తించిన షాపు యజమాని పవన్‌కుమార్ మణియార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం బీసీఎంరోడ్‌లో సీఐ సతీశ్, పట్టణ ఎస్‌ఐ రాఘవయ్య ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టగా అశోక్, మనీశ్ కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు సిగరెట్ కాటన్లను చోరీ చేసి.. గణపతి అనే వ్యక్తితో కలిసి హైదరాబాద్‌లో విక్రయించినట్లు తేలింది. వీరంతా రాజస్థాన్ వాసులు కాగా.. అశోక్ గతంలో పాల్వంచలోని శాస్త్రీరోడ్‌లో ఓ కిరాణా హోల్‌సేల్ దుకాణంలో పనిచేసి మానేశాడు. అశోక్, మనీశ్, గణపతి, గణేశ్, సునీల్ కలిసి చోరీ చేశారని, మిగితా ఇద్దరిని పట్టుకోవాల్సి ఉందని డీఎస్పీ వివరించారు. వారి నుంచి రూ.5 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

మార్కెట్ల కార్యకలాపాలపై జేడీఎం సమీక్ష



ఖమ్మం మిర్చి యార్డులో పరిశీలిస్తున్న జేడీఎం శ్రీనివాస్, పక్కన డీడీ తదితరులు

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ల నిర్వహణ, ఫీజు వసూళ్లపై మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్ సమీక్షించారు. ఖమ్మంలోని మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో శనివారం ఆయన కార్యదర్శులు, ఇతర అధికారులతో సమావేశమై మార్కెట్ల వారీగా లక్ష్యాలపై చర్చించారు. వెనకబడిన చోట మార్చి నెలాఖరులోగా లక్ష్యాన్ని చేరుకోవాలని, వ్యాపారుల నుంచి రావాల్సిన బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, ప్రభుత్వ సంస్థల వద్ద పేరుకుపోయిన బకాయిలపైనే శ్రద్ధ చూపాలన్నారు. అంతేకాక ఖమ్మం సహా ఇతర మార్కెట్లలోనూ మిర్చి కొనుగోళ్లకు ఏర్పాట్లుచేయాలని, తద్వారా రైతులకు భారం తగ్గించాలని ఆదేశించారు. ఇందుకోసం మద్దులపల్లి, నేలకొండపల్లి, ఏన్కూరు, వైరా, మధిర మార్కెట్ల పరిధిలో ట్రేడర్లు, కోల్డ్ స్టోరేజీల నిర్వాహకులతో సమావేశం కావాలని తెలిపారు. వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం డీఎంఓలు ఎం.ఏ.అలీం, నరేందర్, ఖమ్మం మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి ప్రి.వీణ్‌కుమార్, గ్రేడ్-2 కార్యదర్శి వి.సుజన్‌బాబుతో పాటు ఉమ్మడి జిల్లాలోని 14 మార్కెట్ల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖమ్మం మార్కెట్‌లోని మిర్చి యార్డును జేడీఎం శ్రీనివాస్, డీడీ పద్మావతి అధికారులు పరిశీలించారు. మిర్చి కొనుగోళ్లు, నిల్వలు, రవాణాపై సూచనలు చేశారు.

బీసీలకు రాజకీయాలను శాసించే అవకాశం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి పూల రవీందర్‌ను బీసీలంతా ఏకమై భారీ మెజార్టీతో గెలిపించాలని, తద్వారా భవిష్యత్ రాజకీయాలను శాసించవచ్చని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించడానికి సంఘం ఆధ్వర్యాన ఈనెల 17 నుండి 26వ తేదీ వరకు ‘ఓటు మనదే.. సీటు మనదే – మేమెంతో మాకంత’ నినాదంతో ప్రచార యాత్ర నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పార్టీలకతీతంగా సంఘటితమై బీసీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపిస్తే రాష్ట్ర రాజకీయాలలో రెడ్ల రాజకీయాలకు అడ్డుకట్ట వేసినట్లవుతుందని తెలిపారు. నల్లగొండ – ఖమ్మం – వరంగల్ ఎమ్మెల్సీ పరిధిలో 27వేల మంది ఓట్లకు గాను 2వేల మందే రెడ్డి సామాజికవర్గం వారు ఉండగా, మిగతా వారంతా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలేనని చెప్పారు. అయినప్పటికీ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నలుగురు పోటీలో ఉన్నారని తెలిపారు. ఇక బీసీలకు పార్టీలు సైతం మద్దతు తెలపకుండా అవమానించాయని వెల్లడించారు. ఈనేపథ్యాన ఓటే ఆయుధంగా బహుజనులు ఏకమై రవీందర్‌ను గెలిపించాలని, తద్వారా రాజకీయ అధికారానికి పునాదులు పడి 2028లో బీసీ రాజ్యం సిద్ధిస్తుందని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు సుంకర శ్రీనివాస్, డాక్టర్ కే.వీ.కృష్ణారావు, పేళ్లూరి విజయ్‌కుమార్, వల్లె సోమరాజు, మోత్కూరి వెంకటేశ్వరాచారి, పసుపులేటి నాసరయ్య, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్‌గౌడ్, అంకిరెడ్డి ప్రసాద్, పద్మాచారి, నరేందర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.